# ఏపూరు గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): – నెల్లూరు జిల్లా రాపూరు మండలం ఏపూరు గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయని వైసీపీకి మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే నైతికత లేదన్నారు. రాజకీయ ఉనికి కోసమే వైసీపీ నాయకులు మెగా డీఎస్సీపై బురదజల్లుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి 16,400 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత మంత్రి నారా లోకేష్, కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు ఉద్యోగులకు పీఆర్సీ అమలు వంటి కీలక నిర్ణయాలు తీసుకుని ఉద్యోగ, విద్యా రంగాలకు ఊతమిచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే రామకృష్ణ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు.

# పెంచలకోనలో వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ

- ప్రతి శుక్రవారం ప్రత్యేక సేవలు
- రూ.500/- తో సేవా టికెట్ పొందే అవకాశం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నందు శుక్రవారం సందర్భంగా శ్రీ నరసింహస్వామి, శ్రీ ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున 5:00 గంటలకు శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు శ్రీ స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) కన్నులపండువగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రంలో ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక సేవలు నిరంతరాయంగా జరుగుతాయని తెలిపారు. ఈ సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500/- చెల్లించి రశీదు పొంది సేవలో పాల్గొన్న భక్తుల పేరున గోత్రనామాలతో అర్చన జరిపి, స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు 1 కేజీ పులిహోరను భక్తులకు ప్రసాదముగా అందజేశారు. భక్తులకు స్వామివారి సేవలు మరింత త్వరగా, సులభతరంగా అందుబాటులోకి తెచ్చేందుకు దేవస్థానం వారు సరికొత్త సాంకేతికతను జోడించారు. భక్తులు 'మనమిత్ర' వాట్సప్ నెంబర్ (9552300009) ద్వారా శ్రీవారి సేవల్లో డిజిటల్‌గా పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించవచ్చని ఈఓ తెలిపారు. ఈ అద్భుత అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# కమలాపురం రైల్వేస్టేషన్ లో రైళ్లను నిలపండి.!!

- ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 07: కడపజిల్లా.. కమలాపురం నియోజక వర్గ కేంద్రమైన కమలాపురం రైల్వే స్టేషన్ లో కోవిడ్ కు ముందుగా ఆగుతున్న ప్రతి రైలును తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ కమలాపురం స్థానిక శాసన సభ్యులు పుత్తా చైతన్య రెడ్డి, మరియు కమలాపురం రైలు నిలుపుదల సాధన కమిటీ సభ్యులు కలిసి కమలాపురం ప్రయాణికుల పరిస్థితి గుంతకల్లు రైల్వే డిఆర్ఎం చంద్ర గుప్తా వివరించిన అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రైల్వే డిఆర్ఎం చంద్ర గుప్తా మాట్లాడుతూ.. ఈ విషయంపై వెంటనే రైల్వే మంత్రిత్వ శాఖతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైతన్య రెడ్డి తెలియజేస్తూ వీలైనంత త్వరగా రైళ్ళను కమలాపురంలో నిలుపుదలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గం టీటీడీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, మరియు రైలు నిలుపుదల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజాపాలన ధ్యేయం: ఎమ్మెల్యే



గట్టు,బిఎన్ఎస్: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. లబ్ధిదారుడు మహమ్మద్ కుటుంబ సభ్యులకు కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద విడతల వారీగా రూ.5 లక్షలు అందిస్తోందన్నారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన మిగతా వారికి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని, నిధులపై అపోహలు వద్దని స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ కొరడా!

- ఈతకోట టోల్‌ప్లాజా వద్ద 39 బస్సుల తనిఖీ.. 9 బస్సులపై కేసులు.. రూ.21,600 జరిమానా

ఈతకోట:(బిఎన్ఎస్ )ఆగస్టు 7 : ప్రయాణికుల భద్రతను గాలికొదిలి నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపే ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈతకోట టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఏకంగా 39 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను అధికారులు తనిఖీ చేశారు. వివిధ రవాణా నిబంధనలను ఉల్లంఘించిన 9 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.21,600 జరిమానా విధించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రయాణికుల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. బస్సుల పత్రాలు, రవాణా నిబంధనల అమలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతూ నిబంధనలు ఉల్లంఘించే బస్సులపై ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అతివేగం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అతివేగంతో దూసుకెళ్లడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి చర్యలు ప్రయాణికుల ప్రాణాలను నేరుగా ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే డ్రైవర్లు, బస్సుల యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదేవిధంగా ప్రయాణికుల వ్యక్తిగత బ్యాగేజీ మినహా కమర్షియల్ లగేజీని నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులను తరలించేందుకు అనుమతులు పొందిన బస్సులను వాణిజ్య సరుకుల




ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

రవాణాకు వినియోగిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈతకోట టోల్‌ప్లాజా వద్ద జరిగిన తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, షణ్ముఖ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎస్.ఆర్ – 1 డ్యాం నుంచి చింతకుంట చెరువుకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల

- మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 07:మైదుకూరు నియోజకవర్గం లోని, దువ్వూరు మండలం. చల్లబసాయపల్లె వద్ద ఉన్న ఎస్ఆర్--1 డ్యాం నుంచి చింతకుంట చెరువుకు 100 క్యూసెక్కుల నీటిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ.. ఈఏడాది తగినంత వర్షపాతం లేకపోవడం, అలాగే ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉండే వరి పంటకు బదులుగా, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ వ్యవసాయం చేపట్టాలని, తద్వారా ఎక్కువ మంది రైతులు నీటి ప్రయోజనం పొందగలరని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమం, సాగునీటి నిర్వహణ మరియు ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుట్టా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, రైతులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైదుకూరులో ఘనంగా అవయవ దాన అవగాహన సదస్సు



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 07: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ మరియు అఖిలభారత శరీర అవయవదాన సంఘం ఆధ్వర్యంలో మైదుకూరు వెంకట్రాముడు వి.ఆర్ జూనియర్ కళాశాల నందు అవయవ దానం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మైదుకూరు మండలం నంద్యాల పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పోరెడ్డి శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. మనిషి జీవించినప్పుడు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని కాపాడవచ్చు అని, మనిషి ప్రమాదాల బారిన పడినప్పుడు, బ్రెయిన్ డెడ్ అయినప్పుడు, మనిషి శరీరంలోని అవయవాలను అవసరం ఉన్న వాళ్లకు దానం చేసి వారికి, వారి కుటుంబాలను ఆనందం చూడొచ్చని అలాగే మరణానంతరం కళ్ళను దానం చేసి ఇతర జీవితాల్లో వెలుగు నింపుకోవచ్చని, అలాగే మరణానంతరం శరీరాన్ని దేహాన్ని వైద్య కళాశాలలకు దానం చేసి విద్యార్థులకు పరిశోధనలకు ఉపయోగపడుతుందని అన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ కడపశాఖ అధ్యక్షులు మరియు ప్రముఖ న్యాయవాది డాక్టర్ జాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు అవయవ దానం చేయడం వల్ల మరణించిన జీవించవచ్చని, అవయవ దానం ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, అంతేకాకుండా మరణానంతరం మట్టిలో కలిసే శరీరాన్ని ఇతరులకు దానం చేయడం వల్ల అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ కడప జిల్లా శాఖ ఉపాధ్యక్షురాలు వసుధ భార్గవి మాట్లాడుతూ.. అవయవ దానం చేయడం వలన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే పారితోషికాలు మరియు రాయితీలనువివరించడం జరిగింది. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్ మరియు విశ్రాంత ఉపాధ్యాయులు చలమయ్య అవయవ దానం వల్ల కలిగే ప్రయోజనాలను పాటల రూపంలో విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట రాముడు వి.ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బండి తిరుమలేష్, అవధూత కొండయ్య స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, వాగ్దాడం శివశంకర్, మోతె ఉపేంద్ర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత ఉత్సవం



నల్లగొండ (బిఎన్ఎస్): స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన చేనేత ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసేలా 1905 లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత ఉత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7న "జాతీయ చేనేత దినోత్సవం" గా నిర్వహించుకోవడం సంతోషకరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. అనంతరం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అక్కడి నుండి రాఘవేంద్ర కాలనీ వరకు నిర్వహించిన చేనేత ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో భాగంగా నిర్వహించిన స్వదేశీ ఉద్యమం సందర్భంగా చేనేత గొప్పతనాన్ని అందరికీ చాటి చెప్పడం జరిగిందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకునే తదనంతరం దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు,చేనేత రంగానికి అనేక రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నదని , చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు, పెన్షన్లు అందిస్తున్నదని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత రంగానికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వరుణయాగం ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



నల్లగొండ (బిఎన్ఎస్): నాగార్జునసాగర్ లోని విజయ విహార్ వద్ద ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించనున్న నేపథ్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నాగర్జున సాగర్ లో యాగ ఏర్పాట్లను సమీక్షించారు.. వరుణ యాగం నిర్వహించే యాగస్థలి, ప్రవచనశాల, యాగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల పై దేవాదాయ , రెవెన్యూ, పోలీసు,ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యాగశాల ఏర్పాటు చేసే ప్రదేశం, భారీకేడింగ్ , పగోడాల ఏర్పాటు, ప్రవచనశాల ,టెంట్లు, ఎల్ఈడిల తో పాటు వివిధ ప్రాంతాల నుండి యాగం నిర్వహించేందుకు వచ్చే ఋత్వికులు, అర్చకులకు వసతి సౌకర్యాల వంటి ఏర్పాట్లన్నీ చేయాలని చెప్పారు. యాగానికి హాజరయ్యే ప్రజలు, ప్రముఖులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు అధిరులు హాజరుకానున్న దృష్ట్యా యాగశాల వద్ద తగిన ఏర్పాట్లతో పాటు, బందోబస్తు,ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు...

